
5069
శ్రీకాకుళం



# సార్థక జీవితం

విజయపురి నగరంలో రాత్రివేళ ఒక సత్రం దగ్గర తచ్చాడుతున్న యువకుడిని చూసి రాజ భటులు అనుమానంతో ప్రశ్నించారు. ఆ యువకుడి మాటలు ఆ ప్రాంతం మాటలు కావు. ఉచ్చారణ వేరుగా వుంది. తన పేరు జానకి రాముడనీ, బాటసారిననీ చెప్పాడు. కాని రాజభటులు అతన్ని నమ్మలేదు. అతను తడబడుతూ జవాబులు చెప్పడం, భయపడడం చూసి శత్రుదేశానికి చెందిన గూఢచారి ఏమోనని అనుమానించి రాజ మందిరానికి తీసుకెళ్ళారు. మహారాజు ముందు హాజరు పరిచారు.

"ఎవరు నువ్వు?" అని ప్రశ్నించాడు మహారాజు.

ఆ యువకుడు తను రాజభటులకు చెప్పిన జవాబులే చెప్పాడు.

"నువ్వు శత్రుదేశానికి చెందిన గూఢచారివని మా భటులు అనుమానిస్తున్నారు. అందుకు నీ సమాధానం ఏమిటి?" అన్నాడు మహారాజు.

"క్షమించండి మహాప్రభూ! నేను గూఢచారిని కాదు. బాటసారిని ఈ రాత్రికి ఆశ్రయం కల్పిస్తే, తెల్లవారి వెళ్ళిపోతాను." అన్నాడు జానకిరాముడు.

నువ్వు గూఢచారివి కావనే నమ్మకం మాకు కలగాలి గదా? నువ్వు మా రాజ్యంలో ఎన్ని రోజుల నుంచి వుంటున్నావో? రహస్య సమాచారం సేకరించి భద్రపరిచి వుండవచ్చును గదా? నిన్ను సోదా చెయ్యాలి. ఏమీ దొరక్కపోతే నిన్ను వదిలేస్తాను" అన్నాడు మహారాజు. అతన్ని నిలువెల్లా సోదా చెయ్యవలసిందిగా భటులకు ఆజ్ఞ ఇచ్చాడు.

జానకి రాముడు రాజుగారి ఆజ్ఞవిని భయపడిపోయాడు.

"మహాప్రభూ! నన్ను నమ్మండి. నేను గూఢచారిని కాదు. నన్ను సోదా చెయ్యడం ధర్మం కాదు. నేను మగవాడిని కాదు. ఆడపిల్లను" అంటూ తలపాగా తీశాడు. పొడుగాటి కురులు బైటపడ్డాయి. పెట్టుడు మీసాలు తీసి వేశాడు.

అంతా ఆశ్చర్యపోయారు.

"ఏమటీ? నువ్వు ఆడపిల్లవా? మగవాడి వేషంలో ఎందుకు తిరుగుతున్నావు? అని అడిగాడు మహారాజు.

"మహాప్రభూ! నా పేరు జానకి. నేను కాంభోజి ద్వీపపు రాజకుమారిని, మా మేనమామ కుట్రచేసి నా తల్లిదండ్రుల్ని చంపి రాజ్యం హస్తగతం చేసుకున్నాడు. నన్ను బలవంతంగా పెళ్ళి చేసుకోవాలని ఖైదు చేశాడు. నేను విశ్వాసపాత్రుడైన ఒక సైనికుడి సహాయంతో బైటపడి పారిపోయి, ఒక వ్యాపార ఓడలో ఇక్కడికి చేరుకున్నాను" అని కన్నీటితో తన కథ చెప్పింది జానకి.

కాంభోజద్వీపం అక్కడికి కొన్నివేల యోజనాల దూరంలో వుంది. అంత దూరం నుంచి ప్రాణాలతో పారిపోయి వచ్చిన యువరాణిని చూసి అందరికీ జాలి కలిగింది.

"సాటి రాజు కుమార్తెవు గనుక నీకు ఆశ్రయం ఇవ్వడానికి అభ్యంతరం ఏమీ లేదు. కాని నేను నీకేమి సహాయం చెయ్యగలను? కాంభోజద్వీపం కొన్నివేల యోజనాల దూరంలో వుంది. సముద్రంలో అంత దూరం సైన్యంతో వెళ్ళగలిగేంత నౌకాబలం నాకు లేదు. నీ రాజ్యాన్ని నీకు అప్పగించడం నాకు అసాధ్యం" అన్నాడు రాజు.

"మహారాజా! నాకు రాజ్యాల మీద, సింహాసనంపైన వ్యామోహం లేదు. విజయపురి వైద్య

విద్యాలయం ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. అందులో వైద్య విద్య నేర్చుకోవడానికి అవకాశం కల్పించండి. వైద్యం ద్వారా ప్రజాసేవ చేసి తరించాలని నా ఆశ." అంది జానకి.

మహారాజు ఆమె ఆశయం విని సంతో షించాడు. ఆమెకు అంతఃపురంలో సకల రాచ మర్యాదలతో ఆశ్రయం కల్పించాడు. జానకి అతి శ్రద్ధతో వైద్యవిద్య నేర్చుకుంటూ వుంది.

కొన్నాళ్ళ తర్వాత విశ్వనాథుడనే వ్యక్తి మహారాజుని కలుసుకున్నాడు.

"మహారాజా! జానకి అనే యువతి తను కాంభోజరాజు కుమార్తెనని చెప్పి మీ అంతః పురంలో సకల రాచమర్యాదలూ అనుభవిస్తూ వుంది. ఆమె అబద్ధాలు చెప్పి మిమ్మల్ని మోసం చేసింది" అని చెప్పాడు.

"జానకి ఎవరు?" అన్నాడు రాజు.

"నేను జానకి మేనమామని మహారాజా! మాది వల్లభాపురం. ఆమె తండ్రి బట్టలు నేసి జీవి స్తుంటాడు. జానకి ఇల్లు వదిలి పారిపోయి వచ్చింది" అన్నాడు విశ్వనాథుడు.

"నువ్వు చెపిందంతా నిజమేనా?" అన్నాడు రాజు.

"నిజమే మహాప్రభూ!"

'నువ్వు కొంతవరకే నిజం చెప్పావు. చెప్ప వలసింది ఇంకావుంది. దాచకుండా అంతా చెప్పు' అన్నాడు రాజు.

విశ్వనాథుడు తత్తరపడ్డాడు. భయంతో వణికి పోయాడు. అతని నోట మాటలు రాలేదు.

రాజు జానకిని తన సమక్షానికి పిలిపించాడు. అక్కడ విశ్వనాథుడిని చూసి భయపడింది జానకి.

"మీది వల్లభాపురమనీ, తల్లిదండ్రుల్ని వదిలి పారిపోయి వచ్చావనీ మీ మేనమామ చెప్తున్నాడు. కారణం ఏమిటి?" అని అడిగాడు రాజు.

"నేను పారిపోయి వచ్చిన మాట నిజమే. నేను కాంభోజిరాజు కుమార్తెను కాదు. తమకు అసత్యం చెప్పాను" అన్నది జానకి.

"నువ్వు రాజకుమార్తెవు కాదని నాకు ఎప్పుడో తెలుసు. భయపడకుండా నిజం చెప్పు. నువ్వు ఇంటి నుంచి ఎందుకు పారిపోయి వచ్చావు?" అన్నాడు రాజు.

"మహాప్రభూ! ఈ విశ్వనాథుడు నాకు స్వయానా మేనమామ కాదు. దూరపు చుట్టం. నా తండ్రి ఇతని దగ్గర వెయ్యి వరహాలు అప్పు చేశాడు. ఆ అప్పు వెంటనే తీర్చమని వత్తిడి చేశాడు. లేకపోతే నన్ను తనకిచ్చి పెళ్ళి చెయ్యమని బలవంతం చేశాడు. నా తండ్రి బీదవాడు. అప్పు తీర్చే పరిస్థితిలో లేడు. ఇతనికి భార్య, పిల్లలు న్నారు. నా కంటే వయస్సులో చాలా పెద్దవాడు. నా తండ్రి దుస్థితిని అవకాశంగా తీసుకుని, కూతురు వయసున్న నా మీద కన్ను వేశాడు. నా తండ్రి దిక్కుతోచని స్థితిలో ఇతనితో పెళ్ళికి

అంగీకరించాడు. ఇష్టంలేని పెళ్ళి తప్పించుకునేందుకు మగవేషంలో పారిపోయి వచ్చాను" అన్నది జానకి.

"జానకీ! నువ్వు అబద్దాలు చెప్పినా నా ఆశ్రయం కోరావని నాకు తెలుసు. వేగుల ద్వారా నీ విషయం అంతా తెలుసుకున్నాను. కాంభోజి రాజకుమార్తెనని ఎందుకు చెప్పావు?" అన్నాడు మహారాజు.

"మహారాజా! ఇందులో మీకు తెలియనిది ఏమీ లేదు. నాకు చిన్నప్పటి నుంచి ఎద్దైనా సాధించాలనే ఆశ వుండేది. ఇంటి నుంచి పారిపోయాక ఎట్లా జీవించాలా అని విచారించాను. బట్టలు నేయడం నాకు తెలుసు. ఆ విధంగా జీవించవచ్చును. కాని అది నా కెందుకో తృప్తిగా లేదు. విజయపురి చేరుకున్న తర్వాత వైద్య విద్యాలయం చూశాను. వైద్యం నేర్చుకుంటే ప్రజా సేవ చేసి తరించవచ్చుననే ఆలోచన వచ్చింది. కాని అందులో నా వంటి సామాన్యురాలికి ప్రవేశం లేదు. ప్రపంచం నలుమూలలనుండి రాజవంశాల వారు, సంపన్నులు వచ్చి అందులో వైద్య విద్య అభ్యసిస్తున్నారు. అందుకే మీ దర్శనం అయ్యాక యువరాణినని అసత్యం చెప్పాను. నన్ను మీరు ఆదరించారు. వైద్య విద్యాలయంలో నా ప్రవేశం సులభమైంది. గ్రామీణ ప్రజలు వైద్య సదుపాయం లేక అసౌకర్యానికి గురవుతున్నారు. నేను ఏదైనా గ్రామంలో వైద్యవృత్తి చేసి జీవితం సార్థకం చేసుకోవాలనే అబద్ధం చెప్పాను ప్రభూ! నన్ను మన్నించాలి" అన్నది జానకి.

ఆమె ఆశయం విని రాజు సంతోషించాడు.

"ఎక్కువ మంది ప్రవాహంలో కొట్టుకుపోయే గడ్డిపోచల్లా సాదాగా జీవితాన్ని గడుపుతుంటారు. తన జీవితాన్ని పరోపకారానికి ఉపయోగిస్తూ సార్థకం చేసుకోవాలనే ఆశయం బహుకొద్ది మందికి మాత్రమే ఉంటుంది. అందుకే నీ గురించి వేగుల ద్వారా నిజం తెలుసుకున్న ప్పుడు బాధ పడలేదు. ప్రజాసేవలో ఎవరి జీవితమైనా సార్థక మౌతుంది. శ్రద్ధగా విద్య అభ్యసిస్తూ మా అంతఃపురంలోనే వుండు" అన్నాడు రాజు.

జానకి సంతోషించి మహారాజుకి నమస్కరించి వెళ్ళి పోయింది.

"విశ్వనాథా! కామంతో కళ్ళు మూసుకు పోయి జానకి జీవితం పాడు చెయ్యాలనుకున్నావు. నువ్వు నా దేశ పౌరుడివి కాకపోవడం వల్ల బ్రతికి పోయావు. లేకుంటే నీకు కఠిన కారాగార శిక్ష విధించేవాడిని. వెళ్ళు. ఇక నుంచి బుద్ధి తెచ్చుకుని జీవించు" అని మందలించాడు రాజు.

విశ్వనాథుడు బతుకు జీవుడా అని బైట పడ్డాడు.

తర్వాత జానకి వైద్య వృత్తిలో రాణించి ప్రజా సేవ చేసి జీవితం సార్థకం చేసుకుంది.